సంస్కృతం, ఆంగ్లభాషను నేర్చుకోవాలి

తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వీసీ భూమయ్య

రాయదుర్గం: పరిశోధనలో నూతన అంశాలను వివరించడానికి తెలుగుతో పాటు సంస్కృత, ఆంగ్లభాషలను నేర్చుకోవాలని తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య అనుమాండ్ల భూమయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్, తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు అధ్యక్షతన 'తెలుగు భాషా సాహిత్యాల పరిశోధన-పర్యావలోచన' అనే అంశంపై గురువారం రెండురోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏదైనా పరిశోధన అనేది విస్తృత అంశాల పరిజ్ఞానంతో మరింత పరిపుష్టం అవుతుందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో తగినంత మంది అధ్యాపకులు లేకపోవడంతో పరిశోధనలు తగ్గుముఖం పడుతున్నాయన్నారు. సీనియర్ పాత్రికేయులు డాక్టర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ తమతమ సామాజిక, ప్రాంతీయ అస్తిత్వాలను అన్వేషించే దిశగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు .ప్రతి అంశంపై పూర్తి అవగాహన అవసరమని ఆయన సూచించారు. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం ఆచార్యులు అఫ్సర్ మాట్లాడుతూ అమెరికా, మరికొన్ని దేశాల్లో తెలుగు భాషా సాహిత్యాలను నేర్చుకోవడం, అధ్యయనం చేయడం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయన్నారు.

స్టార్టప్ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

టీహబ్-ఎన్ఎస్ఆర్‌సీఈఎల్, ఐఐఎం బెంగళూరు ఎంఓయూ

రాయదుర్గం: భారతదేశంలో స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో టీహబ్-ఎన్ఎస్ఆర్‌సీఈఎల్, ఐఐఎం బెంగళూరుతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎన్ఎస్ఆర్‌సీఈఎల్ సీఈఓ ఆనంద శ్రీ గణేష్, ప్రోగ్రామ్ మేనేజర్లు విశాల్, కార్తీక్‌కుమార్ చౌదరి, టీహబ్ ఇన్‌చార్జీ సీఈఓ సుజిత్ జాగిర్దార్, అధికారులు పాల్గొన్నారు. బెంగళూరు, హైదరాబాద్‌లోని పర్యావరణ వ్యవస్థలలో మహిళల నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకులుగా ఎదిగేందుకు గొప్ప అవకాశాలను అందించడానికి రెండు సంస్థలు సమిష్టిగా కృషి చేస్తాయి. కార్యక్రమంలో టీహబ్, ఎన్ఎస్ఆర్‌సీఈఎల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువుల సంరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే గాంధీ

చందానగర్ : చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కొత్తకుంట చెరువు సుందరీకరణ, పునరుద్ధరణ పనులు పూర్తైన నేపథ్యంలో కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, ఐటీ కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ, జెన్ పాక్, యునైటెడ్ వే హైదరాబాద్ ఐటీ కంపెనీతో పాటు సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా సుందరీకరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. భవిష్యత్తు తరాలకు నీటి కొరత రాకుండా ఇప్పటి నుంచి నీటి వనరులు కాపాడుకోవాలన్నారు. మురుగు నీరు కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టు పైప్‌లైన్ నిర్మించామన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరిస్తామన్నారు. పర్యావరణం పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఐటీ సంస్థ ప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు


నిందితులు

శంషాబాద్‌రూరల్: ఇంటి ముందు నిలిపిన బైక్‌ను దొంగిలించిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాల్మాకుల వాసి అల్లం జగన్ తన ద్విచక్ర వాహనాన్ని ఈనెల 24న సాయంత్రం ఇంటి ముందు నిలిపి లోపలికి వెళ్లాడు. కాసేపటి తర్వాత బయటకు వచ్చి చూస్తే బైక్ కనిపించలేదు. దీంతో 26న పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు.

◆ షాద్‌నగర్ ప్రాంతంలోని చటాన్‌పల్లి వాసి సబావత్ దేవ, మహబూబ్‌నగర్‌కు చెందిన మహ్మద్ సోహైల్‌ను గురువారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. గతంలో వీరిద్దరిపై షాద్‌నగర్, కొత్తూరు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో కేసులు ఉన్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూలక ముందే కూల్చేయండి!

● పద్మశాలిపురంలో శిథిలావస్థకు చేరిన వాటర్‌ట్యాంక్ ● ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్న స్థానికులు


శిథిలావస్థకు చేరిన పురాతన మంచి నీటి వాటర్ ట్యాంక్


తుప్పు పట్టిన ట్యాంక్ బీములలో ఉన్న స్టీలు

మైలార్‌దేవ్‌పల్లి: శిథిలావస్థకు చేరుకున్న 60 అడుగుల వాటర్‌ట్యాంక్ ప్రమాదకరంగా మారడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు కూలుతుందోనన్న భయం పట్టుకుంది. అదో పురాతన వాటర్‌ట్యాంక్ ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి. ప్రమాదం జరగక ముందే కూల్చివేయాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎస్‌జీవోస్‌కాలనీ, పద్మశాలిపురానికి ఆనుకొని ఉన్న 9లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఈ వాటర్‌ట్యాంక్‌ను 40ఏళ్ల క్రితం జల మండలి నిర్మించింది. సుమారు 20ఏళ్లు పద్మశాలిపురం, టీఎస్జీవోస్ కాలనీ, మధుబన్‌కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీల ప్రజలకు తాగునీటిని అందించింది. నాలుగు దశాబ్దాలు కావడంతో దాదాపు శిథిలావస్థకు చేరింది.

వాటర్‌ట్యాంక్‌ను కూల్చేసి పార్కును నిర్మించాలి..

◆ పదేళ్ల క్రితం తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మధుబన్‌కాలనీలో కొత్తగా 90 లక్షల సామర్థ్యం ఉన్న భారీ రిజర్వాయర్‌ను నిర్మించారు. ఈ ట్యాంక్ నుంచి కాటేదాన్, గగన్‌పహడ్, మధుబన్‌కాలనీ, పద్మశాలిపురం, హౌసింగ్ బోర్డు కాలనీల ప్రజలకు మంచి నీరును అందిస్తోంది. అయితే పద్మశాలిపురంలోని పురాతన వాటర్ ట్యాంక్‌ను కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న వాటర్ ట్యాంక్ పెచ్చులూడి పడుతున్నాయని చెబుతున్నారు. వాటర్ ట్యాంక్‌కు ఆనుకొని కొన్ని ఇళ్లను నిర్మించుకున్న వారు ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌ను కూల్చివేసి దాని స్థానంలో పార్కును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులకు లేఖ రాశాం: కాటేదాన్ జలమండలి డీజీఎం

శిథిలావస్థకు చేరిన ట్యాంక్ అంత తొందరగా కూలదని కాటేదాన్ జలమండలి డీజీఎం తెలిపారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ అధికారులకు లేఖ రాశాం. వారు పరిశీలించి కూల్చేయాలా? వద్దా అనేది నిర్ణయం తీసుకుంటారు. చుట్టూ నిర్మాణాలు ఉన్నాయి. కూల్చడానికి ఇబ్బందులు ఎదురవుతాయి. కూల్చాలని జేఎన్‌టీయూ వింగ్ వారు చెప్పేదానిపై ఆధారపడుతుంది.

కూల్చేయండి



మా ఇంటి ముందు ట్యాంక్ ఉంది. అది పూర్తిగా నిరుపయోగంగా మారింది. దాదాపు శిథిలావస్థకు చేరుకుంది. ట్యాంక్‌కు ఆనుకొని ఉన్నవారు కూడా భయపడుతున్నారు. అధికారులు ట్యాంక్‌ను పరిశీలించి కూల్చేయాలి. – శ్రీకాంత్, స్థానికుడు

పీఅండ్‌టీకాలనీ సమస్యలు పరిష్కరించండి


కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న పీఅండ్‌టీ కాలనీ అసోసియేషన్ సభ్యులు

బండ్లగూడ: పీఅండ్‌టీ కాలనీ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు గురువారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్రను కలిశారు. పీఅండ్‌టీ కాలనీలోని ఐబీ మాల్, సక్సెస్ స్కూల్, ఆలంగర్ మసీదు ప్రాంతాల్లో హైమాస్ట్ లైట్లు పని చేయడం లేదని ఆయనకు తెలిపారు. వీటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. దోమల బెడద అధికంగా ఉందని వీటి నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో పీఅండ్‌టీ కాలనీ, నర్సారెడ్డికాలనీ తదితర ప్రాంతాల్లో ఉన్న మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టేలా చూడాలని కోరారు. పీఅండ్‌టీ కాలనీలో పెండింగ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగర్‌గౌడ్, సీనియర్ నాయకులు ఖాజా, మాజీ కోఆప్షన్ సభ్యులు రజాక్, అసోసియేషన్ అధ్యక్షుడు నదీమ్, ప్రధాన కార్యదర్శి జె.బి.అబ్దుల్ హఫీజ్‌ఖాన్ సయ్యద్, ఎండీ షఫీ షహబ్, ఆరీఫ్, కుద్బుద్దీన్, మాజీ ఎమ్మార్వో జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను చేపట్టాలి

రాజేంద్రనగర్: రంజాన్ పండుగను పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రార్థన మందిరాల వద్ద అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీ-బ్లాక్ అధ్యక్షుడు మహ్మద్ ఖాలీద్ జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఈ సందర్భంగా సర్కిల్ ఉపకమిషనర్ రవి కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అత్తాపూర్, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలో ఉన్న ప్రార్థన మందిరాల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు వీధి దీపాలు, మంచినీటి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారులకు విన్నవించానన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ అందజేస్తుందని వెల్లడించారు. పండుగ నేపథ్యంలో ఇబ్బందులు కలుగకుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరామన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి


బండ్లగూడలోని కళాశాల కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాలేజీల యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ విజ్ఞాన్ కాలేజీ, బైరాగిగూడలోని మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజీ, బండ్లగూడలోని ఆర్జెంట్ కాలేజీలను సందర్శించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లు చేయాలని సూచించామని తెలిపారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం


మణికొండ పోచమ్మ దేవాలయం ప్రాంతంలో అన్నదాన కార్యక్రమం







అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో గురువారం మహాశివరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. హైదర్‌గూడ శ్రీ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవాలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం దేవాలయ ప్రాంగణంలో వివిధ రకాల పూలతో ముస్తాబు చేశారు. సాయంత్రం దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు

రాజేంద్రనగర్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని బుద్వేల్ శివాంజనేయ స్వామి దేవాలయం, రాజేంద్రనగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద గురువారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం మహా శివరాత్రి అనంతరం ఈ దేవాలయాల వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. గురువారం ఉదయం తెల్లవారుజామున అభిషేకం అనంతరం పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు కొనసాగిన మహా శివరాత్రి పండుగ ఉత్సవాలు సాయంత్రానికి ముగిశాయి.

అన్నదానం

మణికొండ: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు అనుబంధంగా మణికొండలోని సముద్రాల వాణీర మేష్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా అన్న ప్రసాద వితరణ సేవ చేపట్టారు. మణికొండ క్వార్టర్స్‌లోని పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి స్థానికులు వచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందాట రాఘవరెడ్డి, దొడ్డి లక్ష్మణ్, సుధాకర్‌రెడ్డి, శేఖరం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మణికొండ: నార్సింగి సెక్షన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు ఏఈ వి.మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డు సబ్‌స్టేషన్ పరిధిలోని వివేకానంద ఫీడర్‌లో ఉదయం 11 నుంచి 2 గంటల వరకు వివేకానందానగర్, నార్సింగి గ్రామం, నార్సింగి హైట్స్, క్యూబా కాలనీ.


◆ బాలాజీ నగర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు మంచిరేవుల, మాంతి విల్లాస్, గ్రీన్ లాండ్, జై హింద్ కాలనీ.

◆ న్యూ నార్సింగి ఫీడర్‌లో ఉదయం 11గంటల నుంచి 2గంటల వరకు నార్సింగి గ్రామం. - - బాబుఖాన్ ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు 250 గజాల గోల్డెన్ మెల్, బాబుఖాన్ విల్లాస్, గ్రాండ్ ఇన్‌ఫ్రా టెక్ విల్లాస్, దంతు స్వీట్ హౌస్.

◆ అక్షయపాత్ర ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు సెనిట్రీ అపార్ట్‌మెంట్, ఉదయ్‌నగర్ కాలనీ, రెడ్డిబస్తీ, కోకాపేట్ ప్రభుత్వ స్కూల్, డీపీఆర్ అపార్ట్‌మెంట్, ఎర్త్ హుడ్ అపార్ట్‌మెంట్, రాజపుష్ప, వెస్ట్ ఎవెన్యూ విల్లాస్, ఓపెన్ స్కై విల్లాస్, వెట్రీక్స్.

◆ కోకాపేట్ ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు కోకాపేట్ గ్రామం, లాన్జ్ అపార్ట్‌మెంట్, జశ్విత అపార్ట్‌మెంట్, కోకాపేట్ 60 గజలు, కోకాపేట్ 80 గజాలు, రాజీవ్ గృహకల్ప, గ్రీన్ బ్లూమ్స్ అపార్ట్‌మెంట్, ఎడెన్ గార్డెన్స్, పొలూమీ అరూస్టోస్, అల్లూరా నార్త్ స్టార్స్ విల్లా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు


గగన్‌పహాడ్‌లోని హజ్రత్‌బాబా దర్గాలో ప్రార్థనల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గగన్‌పహాడ్‌లోని దర్గా హజ్రత్ బాబా దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒక్కడ ఏర్పాటు చేసిన అన్న వితరణ కార్యక్రమంలో పేదలకు అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సరికొండ వెంకటేష్, వికలాంగుల సమాఖ్య ప్రతినిధి మహబూబ్, ముస్లింలు పాల్గొన్నారు.

ఎంఎంటీటీసీ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా ప్రొ.వెంకటరమణ



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని మాలవ్య మిషన్ టీచర్ ట్రెనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) ఇన్‌చార్జీ డైరెక్టర్‌గా సీనియర్ ప్రొఫెసర్ వి వెంకటరమణ నియమితులయ్యారు. ఆయన హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. ఎంఎంటీటీసీ ద్వారా ఉపాధ్యాయులు/ అధ్యాపకుల సామర్థ్యాన్ని శిక్షణ ద్వారా పెంపొందించడానికి పనిచేస్తుంది. బోధన, పరిశోధన, ప్రచురణలు, పేటెంట్లు, సంస్థాగత అభివృద్ధిలో భారతీయ విలువలను పెంపొందించడంమే లక్ష్యంగా ఈ మిషన్ పని చేస్తుంది.



నిరుపయోగంగా మోడల్ మార్కెట్లు



ప్రేమావతిపేట్‌లో నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్

అత్తాపూర్: తాజా కూరగాయలు, మాసం ఉత్పత్తులు నిత్యవసర సరుకులు స్థానిక ప్రజలకు అందదించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న ధృడ సంకల్పం నేటికీ అమలుకు నోచుకోలేదు. నగర ప్రజలకు ఎక్కడికి అక్కడ డివిజన్ల వారిగా మోడల్ మార్కెట్ల వ్యవస్థను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రేమావతిపేట్, టీఎన్‌జీవోస్ కాలనీ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ భూములలో జీప్లస్‌టూలో మోడల్ మార్కెట్‌లను నిర్మించారు.

◆ ప్రేమావతిపేట నిర్మించిన మార్కెట్‌ను అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. విలువలతో కూడిన ఆహారాన్ని ప్రతి కుటుంబానికిఇ అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్న ఈ మోడల్ మార్కెట్ వ్యవస్థ ప్రజలకు అందుబాటులోకి రాలేదు. మోడల్ మార్కెట్‌లో నిర్మించిన దుకాణాలను వివిధ కేటగిరిల వారీగా కేటాయించాల్సి ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం లోపం కారణంగా ఆ దుకాణాలను కేటాయించలేదు. దానికి తోడు మోడల్ మార్కెట్‌లో బాడుగలు కూడా ఎక్కువగా ఉన్నాయని వర్కౌట్ అవుతున్నాయా లేదా అనే సందేహాలతో ముందుకు సాగలేదు.

◆ 8 సంవత్సరాలుగా ఇలాంటి ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడకుండా ఉన్నాయని వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతూ సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. రాజకీయ ప్రమేయంతో ఉన్నాయి మార్కెట్ వ్యవస్థలో అధికారులు తాము ఏమీ చేయలేని పరిస్థితి ఉందని ప్రభుత్వం నిసర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన మార్కెట్ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాలను కిరాయిలు తగ్గించి స్థానిక యువకులకు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో టెండర్లను ఆహ్వానిస్తాం



స్థానిక ప్రజల అవసరాల కోసం మోడల్ మార్కెట్ వ్యవస్థ రూపు దిద్దుకున్నాయి. మార్కెట్‌లో నిర్మించిన దుకాణాల కిరాయిలు ఎక్కువ ఉన్నాయని స్థానిక ప్రజలు ముందుకు రావడం లేదు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటాం. త్వరలో టెండర్లను ఆహ్వానిస్తాం అర్హులకు దుకాణా సముదాయంలో ఉన్న షాపులను అందిస్తాం. – రవికుమార్, రాజేంద్రనగర్ సర్కిల్ డీఎంసీ

ఉచితంగా కేటాయించాలి



రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసిన మోడల్ మార్కెట్లను అర్హులకు అందించడంలో అధికారులు, అనధికారులు ఘోరంగా విఫలమయ్యారు. ఎన్ని సంవత్సరాలుగా ఏ ఒక్కరికి పనికి రాకుండా పోయాయి. ప్రభుత్వ ఆస్తులతో నిర్మించిన మార్కెట్లలో వెంటనే ప్రారంభించాలి. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం దొరుకుతుంది. దుకాణాలను ఉచితంగా కేటాయించాలి. – రాహురి రాజశేఖర్, అత్తాపూర్

